క్లుప్తంగా

సూర్యతేజేస్‌కు సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో ఫిడే రేటింగ్ సాధించిన మీసాల సూర్యతేజేస్‌ను మంంగళవారం రామకృష్ణ చెస్ అకాడమీలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోచ్ అవ్వారు రామకృష్ణ మాట్లాడుతూ తేజేస్ భవిష్యత్తులో మరింత ఉత్తమ ప్రదర్శనతో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మిగతా విద్యార్థులు తేజేస్‌ను స్ఫూర్తిగా తీసుకుని చెస్‌లో రాణించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు జరుగుతున్నందున బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంతినగర్, శాంతినగర్, దేవినేని గాంధీపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముత్యాలంపాడు, మారుతీనగర్ వ్యాప్తంగా..

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు సెక్షన్ నల్లగేటు ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుతీనగర్ పరిధిలోని కాలువగట్టు, చుట్టుగుంట కాలువ గట్టు, సిమెంట్ రోడ్డు, బీఎస్ఎన్ఎల్ భవన్, కాకర్లవారి వీధి, వీరయ్య వీధి, మాగంటి వారి వీధి, మసీదు వీధి, గద్దే పూర్ణచంద్రరావు వీధి, ప్రకాశరావు వీధి, అనుమోలు శేషగిరిరావు వీధి, గోగినేని వారి వీధి, మిల్క్ బూత్ స్ట్రీట్, పటేల్ రోడ్డు తదితర ప్రాంతాలలో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

రేపు నీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని కేఆర్ మార్కెట్ ప్రాంతం లోబ్రిడ్జి వద్ద ఉన్న 900 ఎంఎం డయా పీఎస్ పంపింగ్ మెయిన్ పైప్‌లైన్ మరమ్మతులకు గురి కావడంతో ఈ నెల 28వ తేదీ గురువారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని గాంధీనగర్, హనుమాన్‌పేట, పూర్ణానందంపేట, బాపిస్టుపాలెం, కేదారేశ్వరరావుపేట, ఖుద్దూస్ నగర్, లోటస్ ఏరియా, రామలింగేశ్వరపేట, సత్యనారాయణపురం, దుర్గాపురం, గులాబీతోట, మధురానగర్, శ్రీనగర్‌కాలనీ, భాను నగర్, టీచర్స్ కాలనీ, ముత్యాలంపాడు, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, అరండల్‌పేట, కస్తూరిబాయిపేట, గిరిపురం, దుర్గా అగ్రహారం, సీతారామపురం, బాడవపేట, ఉడ్మీ పేట, లబ్బీపేట, మల్లికార్జునపేట, వాగు కొండ ప్రాంతాల్లో తాగు నీటి సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాలకు 28వ తేదీ సాయంత్రం నీటి సరఫరా పునరుద్ధరణ చేస్తామన్నారు. స్థానికులు ముందుగా నీటిని నిల్వచేసుకుని వీఎంసీ సిబ్బంది, అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

తల్లి అదృశ్యంపై కుమారుడి ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తల్లి అదృశ్యంపై ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపురం బుద్ధంరాజు వీధికి చెందిన వల్లె అభిషేక్, తల్లి సంధ్య(50) తండ్రి రామకృష్ణ, భార్య, కుమారుడితో నివసిస్తున్నారు. అభిషేక్ భార్య రెండు నెలల గర్భిణి. ఈ విషయాన్ని సోమవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో అభిషేక్ తల్లి సంధ్యకు చెప్పారు. కోడలు తన మాట వినటం లేదంటూ సంధ్య పెద్దగా కేకలు వేసింది. అనంతరం ఎవరికీ చెప్పకుండా సంధ్య ఇంట్లోంచి వెళ్లిపోయారు. దీంతో నగరంలో వెతికినప్పటికీ ఫలితం లేకపోవటంతో అజిత్‌సింగ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవీనగర్‌లో చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు పగుల కొట్టి చోరీ చేసిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవీనగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవీనగర్ ఒకటో లైనులో నందివాడ వెంకట శ్రీదేవి దంపతులు నివసిస్తున్నారు. శ్రీదేవి భర్త పోస్ట్ ఆఫీస్‌లో పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్నారు. వీరు ఈనెల 23వ తేదీ రాత్రి 9 గంటలకు ఇంటికి తాళం వేసి పుట్టపర్తి గుడికి వెళ్లారు. 25వ తేదీ సోమవారం ఉదయం 11.30 గంటలకు ఇంటి పక్క వారు ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తెరచి ఉన్నాయని చెప్పారు. దీంతో మంగళవారం ఉదయం 8 గంటలకు ఇంటికి చేరుకుని వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలోని రూ.24 వేలు, బెడ్‌రూమ్‌లో రూ.12 వేలు, అర కాసు బంగారు బుట్టలు, 17 తులాల వెండి పట్టీలు మాయం అయ్యాయి. దీంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న సీఐ గురుప్రకాష్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కార్పొరేటర్ జానారెడ్డి బాధితులను పరామర్శించారు.

రజకుల చిరకాల వాంఛ నెరవేర్చాం

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- చిట్యాల ఐలమ్మ కల్యాణ మండపం ప్రారంభం



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, శేషు, కార్పొరేటర్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రజకుల చిరకాల వాంఛ అయిన చిట్యాల ఐలమ్మ కల్యాణ మండపాన్ని ఇచ్చిన హామీ మేరకు అన్ని వసతులతో నిర్మించి ప్రారంభిస్తున్నామని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. దుర్గాపురంలో రూ.55.85 లక్షల వ్యయంతో నిర్మించిన చిట్యాల ఐలమ్మ కల్యాణ మండపాన్ని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, బి.జానారెడ్డిలతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు.

ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. సామాన్యులు వివాహాది శుభకార్యాలను ఫంక్షన్ హాళ్లలో చేయడం భారమైన ప్రస్తుత తరుణంలో.. పేద ప్రజల అభిరుచికి తగ్గట్లుగా కల్యాణ మండపాన్ని ప్రారంభించుకోవడం సంతోషదాయకమన్నారు. వెట్టి చాకిరి నిర్మూలన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ధీర వనిత చిట్యాల ఐలమ్మ పేరు మీద కల్యాణ మండపాన్ని ప్రారంభించామని చెప్పారు. పేద, సామాన్య ప్రజలందరూ అట్టహాసంగా పెండ్లి వేడుకలు జరుపుకునే విధంగా సకల హంగులతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించి ప్రారంభించామన్నారు. అభివృద్ధిలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి మరే ప్రభుత్వం సాటిరాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి మాట్లాడుతూ.. రజక సామాజికవర్గానికి అన్నివిధాలా అండదండలు అందించడంలోనూ మల్లాది విష్ణు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారని చెప్పారు. ఎమ్మెల్యే ఇచ్చిన ఒక్క మాటతో ప్రైవేట్ కల్యాణ మండపాలకు ధీటుగా దుర్గాపురంలో రజక కల్యాణ మండపాన్ని నిర్మించామన్నారు. ఎమ్మెల్యే చొరవతోనే గాంధీనగర్‌లో వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ రజక సంఘం అధ్యక్షుడు కందగట్ల శ్రీనివాసరావు, నాయకులు కురిటి శివ, శనగశెట్టి హరిబాబు, పిల్లుట్ల వంశీ, లంకా కుమార్, శీలం భవానీ రెడ్డి, బొప్పన గాంధీ, మండా రాము, కగ్గా పాండు, యర్రంశెట్టి శ్రీనివాస్, బాడిద అప్పారావు, కూనపురెడ్డి అనిల్, వి.బి.ఆచారి, రజక సంఘం నేతలు, పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామివారిని దర్శించుకున్న స్పీకర్ తమ్మినేని



స్వామి వారిని దర్శించుకుంటున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారిని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్పీకర్ తమ్మినేని సీతారాంకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం చిత్రపటంతో సత్కరించారు. మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, కూచిపూడి నృత్యాలు ఆద్యంతం భక్తులను ఆకట్టుకున్నాయి.

సంపు పనులు త్వరగా పూర్తి చేయండి



సంపు పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే విష్ణు

పటమట(విజయవాడతూర్పు): సత్యనారాయణపురం జీవీఆర్ నగర్‌లో అమృత్ పథకంలో నిర్మిస్తున్న సంపు పనులు ఆలస్యం కావడంపై వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ కాంట్రాక్ట్ ఏజెన్సీకి పెనాల్టీ విధించాలని వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌కు ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో కలిసి నిర్మాణం జరుగుతున్న సంపు ప్రాంతాన్ని సందర్శించి జరుగుతున్న పనులపై ఆరా తీశారు. నెల రోజుల్లో సంపు నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రెండోసారి ఇచ్చిన గడువు లోపు నిర్మాణ పనులు పూర్తి చేయకుంటే మళ్లీ పెనాల్టీ విధిస్తామని కాంట్రాక్ట్ ఏజెన్సీని హెచ్చరించారు. స్థానికంగా వెడల్పు చేసిన రోడ్డు వెంబడి, వాంబే కాలనీ మెయిన్ రోడ్డు వద్ద, రైల్వే కాంపౌండ్‌ను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు కమిషనర్‌కు సూచించారు. ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. కార్పొరేటర్లు మూర్తి, జానారెడ్డి తదితరులు పాల్గొన్నారు

అట్టహాసంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులకు కిట్‌లు అందజేస్తున్న కార్పొరేటర్ అనిత, జోనల్ కమిషనర్ శ్రీనివాస్



వాలీబాల్ ఆడుతున్న కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ

లబ్బీపేట(విజయవాడతూర్పు): సామాన్యుల్లో నుంచి సైతం మంచి క్రీడాకారులను గుర్తించే లక్ష్యంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టినట్లు 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా మంగళవారం క్రికెట్, వాలీబాల్ పోటీలను ఆమె ప్రారంభించారు. 24వ డివిజన్ 88వ సచివాలయానికి సంబంధించి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, బిషప్ అజరయ్య స్కూల్‌లో పోటీలు జరగ్గా, క్రీడాకారులకు జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి కిట్‌లు అందజేశారు. అనంతరం క్రికెట్ టీమ్‌లను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా కుక్కల అనిత మాట్లాడుతూ ఆటలు ఆడటం వలన శారీరక దారుఢ్యంతో పాటు, మానసిక, శారీరక ఆరోగ్యాలు సిద్ధిస్తాయన్నారు. మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలందరికీ క్రీడల్లో భాగస్వాములను చేయాలనే సదుద్దేశ్యంతో ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయండి

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రాను కార్యక్రమాన్ని క్రీడాకారులు విజయవంతం చేయాలని 63వ డివిజన్ కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ అన్నారు. 63వ డివిజన్‌లో 6 సచివాలయాల పరిధిలోని క్రీడా పోటీలను రాధానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో కార్పొరేటర్ పాల్గొని ఆటలను ప్రారంభించారు. క్రీడలు ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం మంచి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోందని, 15 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ జగదీశ్వరి, చైర్మన్ సౌజన్య, సెక్రటరీ రవికిరణ్, పీడీ రావూర్ పాల్గొన్నారు.

పేదల పక్షపాతి వీఎం రంగా



దుర్గాపురంలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే విష్ణు, నాయకులు



ఎమ్మెల్సీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మి



పండ్లు పంపిణీ చేస్తున్న తోట శ్రీనివాస్

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల పక్షపాతి వంగవీటి మోహనరంగా అని, పేద ప్రజల కోసం జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత నేత వీఎం రంగా అని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. దుర్గాపురం గులాబీతోటలో వీఎం రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరితో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళులర్పించారు. ఎల్‌బీఎస్ నగర్‌లో రూ.కోటి వ్యయంతో నిర్మించిన కాపు కల్యాణ మండపానికి రంగా పేరు పెట్టామన్నారు. త్వరలో ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే దుర్గాపురంలో రూ.7.62 లక్షలతో నిర్మించుకున్న ఓపెన్ డయాస్‌కు రంగా పెట్టేలా కౌన్సిల్‌లో తీర్మానం చేసి ఆమోదించేలా చొరవ చూపుతాన్నారు. అనంతరం పలువురు వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి, నాయకులు కురిటి శివ, శనగశెట్టి హరిబాబు, యర్రంశెట్టి శ్రీనివాస్, పిల్లుట్ల వంశీ, లంకా కుమార్, శీలం భవానీ రెడ్డి, బొప్పన గాంధీ, మండా రాము, కగ్గా పాండు, బాడిద అప్పారావు, కూనపురెడ్డి అనిల్, వి.బి.ఆచారి, అభిమానులు పాల్గొన్నారు. దేవీనగర్ వంగవీటి మోహనరంగా బస్టాప్‌లో దేవీనగర్ కాపు సేవాసంఘం ఆధ్వర్యాన రంగా వర్ధంతి జరిగింది. కార్పొరేటర్ జానారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు. పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి మొక్కలు నాటారు. శ్రీనగర్ కాలనీ వాటర్ ట్యాంక్ వద్ద వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్ రంగా విగ్రహానికి నివాళులర్పించారు. ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా, నాయకులు పాల్గొన్నారు. ముత్యాలంపాడులో గొట్టుముక్కల వెంకటేశ్వరరాజు కార్యాలయంలో రంగా విగ్రహానికి నివాళులర్పించారు. 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో గుండే సుందర్ పాల్ వీఎం రంగా చిత్రపటానికి నివాళులర్పించారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): అజిత్ సింగ్ నగర్ ఎమ్మెల్సీ రుహుల్లా కార్యాలయంలో రంగా చిత్రపటానికి ఎమ్మెల్సీ రుహుల్లా, నగర మేయర్ భాగ్యలక్ష్మి నివాళులర్పించారు. రంగా సేవలను కొనియాడారు. న్యూ రాజరాజేశ్వరిపేటలో రాధా రంగా మిత్రమండలి సభ్యులు అనిశెట్టి గోపీ ఆధ్వర్యాన వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. గాంధీ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొని చీరలు పంపిణీ చేశారు.

పాయకాపురం(విజయవాడరూరల్): పాతపాయకాపురంలో ఎమ్మెల్యే విష్ణు, స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి వెంకట్రావ్‌తో కలిసి రంగా విగ్రహానికి నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): గులాబీతోట, శ్రీనగర్ కాలనీ, అజిత్‌సింగ్‌నగర్ పైపులకంపెనీ తదితర ప్రాంతాల్లో రంగా వర్ధంతి కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రంగా సేవలను కొనియాడారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనరాజు, బల్లం కిషోర్, నాయకులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం శాంతినగర్, ఏపీఎస్ రెడ్డి రోడ్డులో నిర్వహించిన రంగా వర్ధంతి కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ పాల్గొన్నారు. వీఎం రంగా ఆశయాల సాధనకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కాపు నాయకులు పాల్గొని రంగా సేవలను కొనియాడారు.

అభినయ కళా సరస్వతి సినీ నటి సావిత్రి



శ్రీ సత్యకు పురస్కారం అందజేస్తున్న బలరామకృష్ణ మూర్తి, విజయలక్ష్మి, ఉమాబలరాం

విజయవాడకల్చరల్: అభినయ కళా సరస్వతి మహానటి సావిత్రి అని ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య సాంస్కృతిక కళాపీఠం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం సావిత్రి వర్ధంతి, మహానటి సావిత్రి సంఘటనా సామ్రాట్ పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ బహుముఖ ప్రతిభాశాలి సావిత్రిగా అభివర్ణించారు. కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ సావిత్రి ఆశయ సాధన కోసం సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రతి ఏటా సావిత్రి జయంతి సందర్భంగా ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. 2023వ సంవత్సరానికి గానూ ఈవెంట్ అధినేత శ్రీ సత్యకు మహానటి సావిత్రి సంఘటనా ఈవెంట్ సామ్రాట్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్, రమణ, చావా నరసింహారావు పాల్గొన్నారు. సినీ సంగీత విభావరి కార్యక్రమంలో భాగంగా సుధా శ్రీనివాస్, శ్రీసత్య రూపశ్రీ, సునీల్ తదితరులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు



మధురానగర్‌లో కలశ పూజ నిర్వహిస్తున్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన దత్త జయంతి వే డుకలు ఘనంగా జరిగాయి. దత్త జయంతి పురస్కరించుకుని బాబా వారికి విశేషంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దత్త హోమం జరిగింది. శ్రీ శివజ్ఞాన పీఠంలో మంగళవారం మార్గశిర పౌర్ణమి, దత్త జయంతి పురస్కరించుకుని దత్తాత్రేయస్వామి వారికి విశేషంగా అభిషేకం, నాగ పడకల పూజను పీఠాధిపతి శివ చార్యులు నిర్వహించారు. శివ ముక్కోటి అక్షీశ్వర మహాదేవునికి స్వర్ణ పుష్పాభిషేకం చేశారు. ధర్మాధికారి పేర్ల శ్యాం ప్రసాద్, గుండు దిలీప్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. మధురానగర్ శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో 108 కలశములతో విశేషంగా దత్తాత్రేయస్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. మందిర కమిటీ గౌరవాధ్యక్షులు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్ఎన్ రాజు, మందిర అధ్యక్షుడు వైవీ శివాజీ, జీ హేమ శివసత్యప్రసాద్, కోనేరు మంజుల రాణి పర్యవేక్షించారు.

పలు ఆలయాల్లో పూజలు

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అజిత్‌సింగ్‌నగర్ భగత్‌సింగ్ పార్క్ సమీపంలోని శ్రీ సద్గురు సంస్థాన్‌లో శ్రీదత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బొమ్మదేవర శ్రీనివాస్, జొన్నవిత్తుల రామకృష్ణ, సీహెచ్ వెంకట రమణ మూర్తి దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాలను సంస్థాన్ అధ్యక్షుడు పి.రామారావు, అరుణ, సరస్వతమ్మ, లక్ష్మి పర్యవేక్షించారు. ఆయా ఆలయాల్లో మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

వైభవంగా కలశ జ్యోతుల మహోత్సవం









ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భవానీలు, భవానీ భక్తులు మంగళవారం సాయంత్రం కలశ జ్యోతులను సమర్పించారు. సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి ఇంద్రకీలాద్రి వరకు నిర్వహించిన కలశ జ్యోతుల మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భవానీలు పాల్గొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మ వారి నామస్మరణ చేస్తూ కలశ జ్యోతులతో ఊరేగింపులో పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

బ్యాడ్మింటన్‌లో సిద్ధార్థ మహిళా కాలేజీ జట్టు సత్తా



విజయవాడస్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళల బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కాలేజీ క్రీడాకారులను ఆ కాలేజీ ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, డైరెక్టర్ డాక్టర్ టి.విజయలక్ష్మి, కన్వీనర్ లలితాప్రసాద్ మంగళవారం అభినందించారు. ఉయ్యూరు ఏజీ, ఎస్‌జీ ఆర్ట్స్, సైన్స్ కాలేజీలో ఇటీవల జరిగిన పోటీల్లో తమ కాలేజీ జట్టు రాణించి ప్రథమ స్థానం సాధించడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా కాలేజీ క్రీడాకారిణులు ఎ.శ్రీరాజ్ఞి, కె.ఉమామహేశ్వరి సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్టులో చోటు దక్కించుకున్నారని చెప్పారు. జట్టుకు శిక్షణ ఇచ్చిన కోచ్ పి.భాస్కర్‌ను వారు అభినందించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: రమణా కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ధనుర్మాసం సందర్భంగా సినీ సంగీత విభావరి, వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తూర్పుకాపు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గడి ఝాన్సీ మాట్లాడుతూ వంగవీటి రంగా ప్రజల కోసం పనిచేశారన్నారు. మోహన రంగా సామాజిక సేవలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రమణా కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు మాంతి రమణ మాట్లాడుతూ.. సంస్థ ద్వారా పేద కళాకారులకు సేవ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్‌రాజు, గాయకుడు రమాశంకర్ పాల్గొన్నారు. పేదలకు వస్త్ర దానం చేశారు. సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.